నాలుగు హత్యలు చేసిన హంతకుడు!

యస్. గీతారాణి

"మిస్టర్ రవీ! ఈసారినుంచి మంచిగా బ్రతకటం నేర్చుకోండి. మరోసారి పోలీసుల దృష్టిలో పడటానికి ప్రయత్నించవద్దు" జైలర్ అతనికి పర్స్ అందిస్తూ అన్నాడు.

రవి వదనం చిన్నబోయింది.

"సార్! మీరు నమ్మినా, నమ్మకపోయినా ఆ రెండు హత్యలూ నేను చెయ్యలేదు."

రవి బాధగా అని, అతనికి నమస్కరించి, జైలుదాటి బయట ప్రపంచంలోనికి అడుగుపెట్టాడు.

అరచేతులతో ముఖాన్ని తుడుచుకొని, మెల్లగా నడవ సాగాడు.

తను ఇప్పుడు ఎక్కడకి వెళతాడు?

తొలుతగా అతనిలో వుదయించిన ప్రశ్న అది.

తనకు తండ్రీ, అన్నయ్యా వున్నారు. కాని వాళ్ళు ఇప్పుడెక్కడ వున్నారో తెలియదు.

తన వాళ్ళని ఎలాగైనా కలుసుకోవాలి. ఆ ఇద్దరి ఒడిలో తల పెట్టుకొని, కంట తడికారుస్తూ, తనలో ఆవేదన నంతటిని చెప్పుకోవాలి.

ఆ ఇద్దరి అనురాగంలో తను అన్నీ మరచిపోవాలి.

రవి తనవాళ్ళనిగురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

అతని హృదయం ఆప్యాయత, అనురాగంకోసం అలమటిస్తున్నది.

అలా నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు.

అతనికి కొద్దిదూరంలో బస్ స్టాప్ వుంది.

ఆ బస్ స్టాప్‌లో ఒక యువతి నిలిచివుంది.

ఆమెకు కొద్దిదూరంలో నలుగురు కుర్రవాళ్ళు నిలబడి, కొంటె మాటలతో ఆమెను అల్లరిపెడుతున్నారు.

ఆ యువతి రవిని చూడగానే—

"హలో!" అని తన చేతిని వూపుతూ రవి దగ్గరకి వచ్చింది. ఆమె పలుకరిస్తుంటే అతను తెల్లబోయాడు.

ఆమె ఎవరో తెలియదు రవికి. అలాంటిది ఆమె 'హలో' అని పలకరిస్తుంటే అతను తెల్లబోయాడు.

ఆ యువతి ముఖభావాలు పసిగట్టి—

"క్షమించండి! ఆ రాస్కెల్స్ నన్ను అల్లరిపెడుతున్నారు. నా కారు చిన్న రిపేర్‌లో వుండటంతో ఈ బస్ స్టాప్‌లో బస్‌కోసం నిలబడ్డాను. వంటరిగా వున్నానుకదా. అని వాళ్ళు అల్లరి పెడుతున్నారు. అందుకనే మిమ్మల్ని పలకరించాను" అని అంది.

రవి ఏం మాట్లాడలేదు.

ఆ యువతే అన్నది "దయచేసి మా ఇంటిదాకా రండి. లేకపోతే వాళ్ళు వెంటపడగలరు" అని.

"పదండి" అన్నాడు రవి ముందుకు నడుస్తూ.

కొంతదూరంవరకూ ఇద్దరూ మౌనంగానే నడిచారు.

ఆ యువతి మౌనాన్ని భరించలేనిదానిలా పెదవి విప్పింది.

"నా పేరు నీరజ. నేను బి.ఎస్సీ పాసయ్యాను. మీరేం చేస్తున్నారు?" అని ప్రశ్నించింది.

"నా పేరు రవి. ప్రస్తుతం జైలునుంచి విడుదలఅయి వస్తున్నాను" రవి తాపీగా చెప్పాడు.

నీరజ అడుగులు ముందుకు పడలేదు.

అందమైన ఆ యువకుడు జైలునుంచి విడుదలఅయి వచ్చినవాడనుకొంటూంటే ఆమెకు చాలా భయంగాను, ఆశ్చర్యంగా వుంది.

"మీరు ఏం తప్పు చేసారని జైలుపాలయ్యారు?"

"రెండు హత్యలు చేశానని కోర్టు నాకు పదేళ్ళు శిక్ష విధించింది. చేయని నేరానికి ఆశిక్షను అనుభవించక తప్పింది కాదు" రవి ఆ మాటలను ఎంతో తేలికగా అనాలనుకొన్నాడు. కానీ అలా అనలేకపోయాడు.

నీరజ సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది.

వేదనంతా అతని పరమే అన్నట్లు ఆవేదన తాలూకు ఛాయలు అతని కన్నులలో కనిపించాయి నీరజకు.

ఎందుకో అతన్ని చూస్తూంటే ఆమె హృదయమంతా అతనిపట్ల సానుభూతితో నిండిపోయింది.

మనసు అతని చరిత్ర వినమని గోల ప్రారంభించింది.

"రవీ! మీ కథ వినాలని వుంది. అలా పార్కు లోనికి వెళదాం రండి" అని అంది.

"నీరజగారూ! గంటక్రితం మీరెవరో నేనెవరో ఒకరికొకరికి తెలియదు. నాపై మీకెందుకింత సానుభూతి."

"గంటక్రితం తెలియకపోయినా ఇప్పుడు తెలిసిందిగా. దయచేసి నామాట కాదనకండి. మీ చరిత్ర వినాలని వుంది."

నీరజ అభ్యర్థిస్తున్నట్లు అంది.

రవికి ఆమె మాటలు చల్లదనాన్ని అందించాయి.

పదేళ్ళ వరకూ అలాంటి అనురాగానికి, ఆప్యాయతకి దూరమైపోయిన అతను ఒక స్త్రీ చల్లని పలుకులకు వెన్నలా కరిగిపోయాడు.

మంత్రముగ్ధుడిలా ఆమెతో పార్కులోనికి నడిచాడు.

ఇద్దరూ ఒక వారగా కూర్చున్నారు.

ఒకరి ముఖాలు ఒకరు చూస్తూ కూర్చున్నారు.

రెండు క్షణాలూ ఆ ఇద్దరిమధ్యా మౌనమే రాజ్యమేలింది.

ఆ తర్వాత రవి గొంతు ఆ మౌనాన్ని చీల్చివేసింది.

2

రవి వయసు అప్పుడు ఇరవై సంవత్సరాలు.

అతని తండ్రి నాగరాజారావు. తల్లి రాజ్యలక్ష్మి, అన్న సూర్యం.

నాగరాజరావుకు లోకంలో ఎన్ని చెడ్డగుణాలున్నాయో అన్ని గుణాలు వున్నాయి.

సూర్యం తండ్రికి ఏమాత్రం తీసిపోడు.

ఆ ఇద్దరూ సర్వసాధారణంగా ఇంటి పట్టున వుండరు. సూర్యం రెండుపూటలూ భోజనానికి వస్తూంటాడు. కానీ నాగరాజారావు మూడేసి రోజులు ఇంటికే రాడు.

రవి ఆ ఇద్దరికి భిన్నంగా వుంటాడు.

అతడికి చదువు ధ్యాస తప్పించి, మరొక దానిపై ఆసక్తి లేదు. పెద్ద చదువు చదవాలన్నదే అతని ఆశ. ఆ ఆశను ధ్యేయంగా పెట్టుకొని కష్టపడి చదువు తున్నాడు. బి.కామ్. సెకెండియర్‌లో వున్నాడు రవి.

ఆరోజు కాలేజీకి వెళ్ళాడు.

ఫస్ట్ పిరియడ్ లీజర్, లాస్ట్ పీరియడ్ లీజర్, సెకెండ్ పిరియడ్ లెక్చరర్ రాకపోవటంతో రవి ఇంటికి వచ్చే శాడు.

రెండుసార్లు తలుపులు కొట్టినా తలుపులు తెరుచుకో లేదు.

రవి వెనుకవైపుకున్న తల్లి గదిదగ్గరికి వెళ్ళాడు గదిలో నిద్రపోతున్నాదేమోనని.

కిటికీ దగ్గరగా చేర వేసివున్నది.

ఓ చేత్తో కిటికీ తలుపును తోసి, లోపల దృశ్యాన్ని చూసిన అతడి శరీరం వేడెక్కిపోయింది.

ఆ గదిలో మంచంమీద రాజ్యలక్ష్మి, విశ్వనాథం అర్థనగ్న శరీరాలతో వున్నారు.

"అమ్మా" రవి గావుకేక వేసాడు.

రాజ్యలక్ష్మి కొడుకు గొంతు విని విశ్వనాథాన్ని ప్రక్కకు తోసివేసి, క్రింద కుప్పలా పడివున్న చీరను అందుకొని, అక్కడనుంచి వెళ్ళిపోయింది.

విశ్వనాథం, రవిని చూసి గాబరా పడిపోతూ డ్రెస్ చేసేసుకొని, వీధిలోకి పారిపోయాడు.

రవికి ఆ దృశ్యం భరింపరానిదిగా అనిపించింది.

తన తల్లి అపవిత్రురాలని అనుకొంటుంటే అతనిలో రక్తమంతా సలసలా కాగిపోయింది.

అందుకు కారకుడైన విశ్వనాథాన్ని తలచుకొంటుంటే అతనిలో ఆవేశం పెరిగిపోసాగింది.

ఇంట్లోనికి రాకుండా ఎక్కడెక్కడో తిరిగి చీకటి పడ్డాక ఇంటికి వచ్చాడు.

తల్లి ముఖంలోకి చూడాలంటే చాలా సిగ్గుగా వుంది అతనికి.

రాజ్యలక్ష్మికి కూడా ఇంచుమించు అలాగే వుంది.

ఆ రోజు నాగరాజారావు ఇంటి పట్టునే వుండటంతో రవి, భర్తతో తనని గురించి ఎక్కడ చెప్పేస్తాడో అనే భయం ఆమెకున్నది.

నాగరాజారావుకూడా ఏదోలా వున్నాడు.

సూర్యం ఇంట్లో లేడు.

రవి తండ్రిగదిలోకి వెళ్ళి ఆయన పెట్టె తెరిచాడు.

పెట్లో రెండు రివాల్వర్స్ కనిపించాయి.

రవికి తెలుసు తండ్రి దగ్గర రివాల్వర్స్ వుంటాయని.

అయితే ఆ రివాల్వర్స్ ఆయనదగ్గర ఎందుకు వుంటాయో అతడికి తెలియదు.

ఒకటి జేబులో పడేసుకొని హోటల్ మదీనాకి వెళ్ళాడు.

విశ్వనాథం ఆ హోటల్‌లో బస చేస్తున్నాడు.

రవి రూమ్‌నెంబర్ సెవెంటీన్ దగ్గరకు వెళ్ళి మెల్లగా తలుపు తట్టాడు.

ఆ సమయంలో విశ్వనాథం మస్తుగా తాగి వున్నాడు. లైటైనా వేసుకోలేదు.

రవి లోపలకి రాగానే చప్పున తలుపులు మూసేసాడు.

కిటికీలోంచి సన్నటి వెలుగు రేఖలు కొద్దిగాలోపలికి ప్రసరిత మౌతున్నాయి.

ఆ వెలుగులో రవిని గుర్తుపట్టలేకపోయాడు విశ్వనాథం.

"విశ్వనాథం! నీవల్ల నా కన్నతల్లి శీలాన్ని కోల్పోయింది. నా తల్లి పతనం కావటానికి కారకుడవు నీవు. నిన్ను బ్రతక నివ్వను" రవి జేబులోంచి రివాల్వర్ బయటకి తీశాడు.

"బొమ్మ పిస్తోలు చూపించి బెదిరిస్తున్నావా?"

విశ్వనాథం ముద్ద, ముద్దగా మాట్లాడుతూ, తూలుతూ ముందుకు రాబోయేడు. అంతే!—

విశ్వనాథం చావుకేక పెట్టి, గుండెల్ని అరచేత పట్టుకొని క్రిందకు ఒరిగిపోయాడు.

రవి ఖంగారుగా కిటికీవైపు చూసాడు.

ఒక ఆకారం వెనుతిరిగి పారిపోతున్నది.

రవి చప్పున లైట్ వేసాడు.

గది నిండా వెలుతురు నిండిపోయింది.

ఆ వెలుగులో విశ్వనాథం శవం రవి కళ్ళకు కనిపించింది.

గుండెల లోంచి కారిన రక్తం నేలపై పడివుంది.

ఆ దృశ్యం చూసి రవి కొయ్యబారిపోయాడు.

ఐదు నిముషాలవరకూ అతను స్థబ్బుగా నిలిచిపోయాడు.

తనకన్నా ముందు విశ్వనాథాన్ని ఎవరో చంపేసారు.

తను పేల్చే లోపలే అతన్ని ఎవరో కాల్చేసారు.

మైగాడ్ తను హంతకుడు కాడు.

ఆవేశంలో హత్య చెయ్యాలనే వచ్చాడు కాని, ఆ భగవంతుని దయవల్ల తను హంతకుడు కాలేదు.

కానీ తను ఇంకా శవందగ్గరే వుంటే, తనని ఎవరైనా చూస్తే...రవికి ఆలోచించటానికి మనస్కరించలేదు.

రివాల్వర్ జేబులోనికి తోసి, తలుపు తీసాడు.

ఎదురుగా హోటల్ మానేజర్ ఇంకా చాలామంది నిలిచివున్నారు. వాళ్ళనందరినీ చూడగానే రవి గుండెలు భయంతో దడదడలాడాయ్. హోటల్ మానేజర్ అందరితో అంటున్నాడు.

"అతను నాతో చెప్తే నేను మొదట నమ్మలేదండీ. రూమ్ నెంబర్ సెవెంటీన్ లోంచి చావుకేక వినపడిందని చెప్పాడు. నిజమో, కాదో అని మిమ్మల్ని వెంటబెట్టుకొచ్చాను. అతను చెప్పింది కరెక్టే. ఈ వెధవ విశ్వనాథంగార్ని చంపేసాడు. పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలి" అని.

రవి భీతిగా చూసాడు.

పిచ్చి ఆవేశంలో హత్య చెయ్యాలనే వచ్చాడు.

తీరా అది తను చెయ్యని నేరం అని తెలుసుకొనేసరికి అతనికి తను నిర్దోషినని నిరూపించుకోవాలనే తపన చెలరేగింది.

అయితే, అతను హత్య చెయ్యలేదని ఎంతలా చెప్పినా ఎవ్వరూ వినిపించుకోలేదు.

పోలీసులు రావటం అతన్ని అరెస్ట్ చెయ్యటం జరిగిపోయింది.

రాజ్యలక్ష్మి కూడా దారుణంగా మరణించటంతో పోలీసులు ఆ ఇద్దరి చావులని కూపీ తీసారు.

విశ్వనాథానికి, రాజ్యలక్ష్మికి అక్రమ సంబంధంవుందని తెలుసుకొన్నారు.

సూర్యం కాని, నాగరాజావుకాని ఆ సమయంలో

ఇంట్లో లేకపోవటంతో, రవి ఆ ఇద్దరి సంబంధాన్ని తెలుసుకొని, ముందు ఆమెను చంపి, ఆ తరువాత విశ్వనాధాన్ని చంపేసాడని నిర్ణయించారు.

విశ్వనాధం గుండెల్లో వున్న గుండు రవి దగ్గరవున్న రివాల్వర్‌లో వున్న గుండులాంటిదే కావటంతో అతనే హంతకుడని కోర్టు అతనికి పదేళ్ళ శిక్ష విధించింది.

3

"ఇది నీరజా నా చరిత్ర. చేయని నేరాలకు పదేళ్ళ శిక్ష అనుభవించాను. నిర్దోషి శిక్షను అనుభవించాడు దోషి ఎక్కడో హాయిగా జీవిస్తున్నాడు. ఏనాటికైనా నాపై హంతకుడనే ముద్ర వేసిన ఆ పాపాత్ముడు నాకు తారసపడితే, వాడిని కోర్టులో నిలబెట్టి నాపై వున్న ముద్రని చెరిపివేసుకొంటాను. ఇదే నాకు మిగిలిపోయిన కోర్కె."

నీరజ అతని వైపు జాలిగా చూసింది.

అతని చరిత్ర విన్నాక ఆమెకు అతనిపై అంతులేని అభిమానం ఏర్పడింది.

"రవీ! జరిగిపోయినదంతా మరచిపోండి. ఇప్పుడు మిమ్మల్ని మా నాన్నగారి దగ్గరకు తీసుకువెళ్ళి వుద్యోగం ఇప్పించమని అడుగుతాను. నాన్నగారు నా మాటను కాదనరు" అని అంది.

రవి కళ్ళు అమితంగా వెలిగిపోయాయి.

చింతలే తన జీవితానికి మిగిలిపోయాయి కాబోలునను కొన్నాడు. కానీ నీరజ దయవల్ల తన జీవితం చిత్రమైన మలుపు తిరుగుతున్నది.

రవికి నీరజ తన పాలిట దైవంలా కనిపించింది.

నీరజ అతన్ని ఇంటికి తీసుకువెళ్ళింది.

తండ్రికి అతన్ని తన స్నేహితుడిగా పరిచయం చేసి యేదయినా ఉద్యోగం యిప్పించమని కోరింది.

గోపాలరావుగారికి కూతురంటే ప్రాణం. ఒక్కర్తే కావటం మూలాన ఆమె యేదికోరినా కాదనలేరు.

ఆయన కూతుర్ని దగ్గరగా తీసుకొని "చూడమ్మా! నా ఫ్యాక్టరీలో యేజాబ్స్ ఖాళీగాలేవు. మన మానేజర్ ఇంకొన్నాళ్ళు పోయాక రిజయిన్ చేసి తన స్వంతవూరు వెళ్ళిపోతానన్నాడు. అంతవరకు రవిని ఖాళీగావుంచడం దండగ. మనసారథి దగ్గర సెక్రటరీగా పనిచెయ్యమను" అని చెప్పారు.

ఆయన మాటలకు రవికళ్ళు చెమర్చాయి.

రెండు చేతులూ జోడించి ఆయనకు నమస్కరించాడు.

4

సారథిగారు చాలా డబ్బుగల వ్యక్తి.

ఆవూరిలో ఆయనకు మంచిపేరువుంది.

ఆయనకి శాంతి ఒక్కతే కూతురు.

బి. ఎ. చదువుకున్నది.

రవి, సారథిగారి దగ్గర పనికి కుదిరాక ఆయనకి కొంత శ్రమతగ్గింది. చాలాపనులు రవే చూసుకుంటున్నాడు.

నీరజా, అతను రోజూ సాయంత్రాలు పార్కులో కలుసుకొంటున్నారు. అందం, మంచి మనసుగల రవిని ప్రేమిస్తోంది నీరజ.

అతనూ ఆమెను ఆరాధించటంతో ఇరువురు మనసులు ఒకటయాయి. తన జీవితం ఎలా వుంటుందో అని కృంగి పోయిన రవి ఇలా అనుకోని మలుపు తిరగటంతో మంచికి

యేనాడూ వంచన జరగదని, మంచివాడు యేనాడూ చెడిపోడని అనుకున్నాడు. తనతండ్రికోసం, అన్నకోసం వెదికాడు. కాని అతనిశ్రమ ఫలించలేదు. వాళ్ళిప్పుడు ఎక్కడున్నారో ఎవరూ చెప్పలేకపోయారు.

ఆరోజు రవి, నీరజతో పార్కుకు వెళ్ళాడు.

ఆమెతో ఒకగంట గడిపి తన ఇంటిదారి పట్టాడు.

రోడ్ మీద మెల్లగా నడుస్తున్నాడు.

అతని మనసంతా ఆనందమయమై వుంది.

అలా తాపీగా నడుస్తున్న అతని ప్రక్కగా ఒక ఎర్రటి కారు వచ్చి ఆగింది.

కారులోంచి ఒక వ్యక్తి క్రిందకుదిగి "హలో మిస్టర్ రవీ!" అని పిలిచాడు.

రవి ప్రక్కకు తిరిగి ఆ వ్యక్తిని చూసి "మీరూ" అంటూ ఆపేసాడు.

ఆ వ్యక్తిని అంతకుముందు చూసినట్లుగా గుర్తయినా లేదు. అలాంటప్పుడు అతను అంత స్నేహంగా పలుకరిస్తుంటే రవి చాలా ఆశ్చర్యపోయాడు.

"రవీ! నీతో మాట్లాడాలి. కారెక్కు."

"నాకు మీరెవరో తెలియదు. నాతో ఏం మాట్లాడతారు?"

"నీకు మాగురించి తెలియకపోవచ్చుకాని, నీ గురించి మాకు బాగా తెలుసు. కారెక్కు."

అతని స్వరం అధికారయుక్తంగా వినిపించింది రవికి. తనని గురించి అతడికి ఏం తెలుసో తెలుసుకోవాలనిపించింది.

"పదండి" అని అన్నాడు.

ఆ వ్యక్తి కారు డోర్ తెరచి రవిని ఎక్కమన్నాడు.

అతను కారు ఎక్కాక తను ఎక్కి కారుని పోనిచ్చాడు. పార్కు ముందు కారు ఆపి క్రిందకు దిగాడు.

రవి డోర్ తెరచుకొని కారుదిగి ఆ వ్యక్తి ముఖంలోకి సూటిగా చూసాడు.

“కమాన్” అంటూ అతను పార్కులోపలికినడిచాడు.

ఇద్దరూ ఎవ్వరూలేనిచోటు చూసుకొనికూర్చున్నారు.

“నాతో ఏం మాట్లాడాలి?” రవి ముందుగా అడిగాడు.

“నువ్వు ఒక హత్య చెయ్యాలి! అందుకు ప్రతిఫలంగా ఇరవై వేలు ముట్టచెప్తాను” ఆ వ్యక్తి నింపాదిగా అన్నాడు.

రవి దిగ్గున లేచినిలబడ్డాడు.

అతనికళ్ళు రక్తారుణిమను దాల్చాయి.

ఆవేశంతో మెడక్రింద నరాలు పొంగాయి.

“నేనేం కిరాయి హంతకుడిననుకొంటున్నావా? లేకపోతే పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి వచ్చావా?”

రవి తీవ్రస్వరాన అంటూంటే ఆ వ్యక్తి చిద్విలాసంగా నవ్వాడు.

“పూర్ రవీ! నీ చరిత్ర నాకు తెలియదనుకోకు. నువ్వు సెంట్రల్ జైలునుంచి విడుదల అయ్యావని తెలుసు. రెండు హత్యలు కూడా చేసావని తెలుసు. హత్యలు చెయ్యటం అలవాటు చేసుకొన్నవాడు హత్య చెయ్యటానికి భయపడకూడదు. ఇద్దర్ని అతి తేలికగా చంపినవాడివి. మరో మనిషిని వంకాయ కోసిపారేసినట్లు కో సెయ్యగలవు!”

“యూ షెటాప్! మరొక్కసారి హత్యపేరు ఎత్తితే

నిన్ను ఇక్కడే గొయ్యితీసి పాతిపెట్టేస్తాను" రవి చెంద్రనిప్పులు చెరిగే కళ్ళతో అతన్ని చూస్తూ అన్నాడు.

"గుడ్ అలాంటి సాహసం కలవాడే కావాలి నాకు. నీలో సాహసం మోతాదు మించివుంది. అందుకే నువ్ ..."

"మిస్టర్! మరొక్కసారి మాట్లాడితే పళ్ళు గవ్వల్లా రాలిపోతాయి జాగ్రత్త!" రవి వుద్రేకంగా అని ముందుకు నడవబోయాడు.

"రవీ! నువ్వెంతో, నీ బ్రతుకెంతో తెలుసుకొని మరీ మాట్లాడు. గోపాలరావుతో, సారధితో నీ చరిత్ర నంతటిని చెప్తే, అప్పుడు నీగతి ఏమౌతుందో ఆలోచించుకో."

రవిలో ఆవేశం చప్పున చల్లారిపోయింది.

పతనమైన తన గత చరిత్ర కళ్ళముందు మెదిలి కలవర పెట్టింది.

"రవీ! నువ్వు నన్ను కాదంటే రేపే నీ చరిత్ర వారి ముందు వుంచుతాను."

రవి ఆ వ్యక్తి ముఖంలోకి చూసి "మిస్టర్! ఒకసారి చెయ్యని నేరానికి ఘోరంగా శిక్షని అనుభవించాను. చదువుకొని వుజ్వలమైన భవిష్యత్ లోకి అడుగుపెట్టవలసిన వయసంతా జైల్లో గడిపాను. ఇప్పుడు హత్యచేసి నా అంతరాత్మముందు దోషిగా నిలబడి, పతనం కాలేను. నాకు నీతిగా బ్రతకటమంటే ఇష్టం! ఆ నీతికోసం నా ప్రాణాలైనా ఆహుతి చేయగలను. కనుక నన్ను వదిలెయ్" అన్నాడు.

"రవీ! నీ చరిత్ర సారధితో చెప్తే నువ్వు నిరుద్యోగివి అవుతావు."

"మీ ఇష్టం!"

రవి మెల్లగా అనేసి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

ఆ వ్యక్తి రవి గుండె ధైర్యానికి విస్తుపోయాడు. కారెక్కి షార్ చేసాడు.

పావుగంట ప్రయాణం చేసాక కారు ఒక బంగళా ముందు ఆపాడు.

బంగళా ముందు గూర్ఖా కాపలావున్నాడు.

ఆ వ్యక్తిని చూడగానే సలాంచేసి గేటు తెరిచాడు.

ఆ వ్యక్తి కారుని లోపలకి పోనిచ్చి ఒక వారగా ఆపి క్రిందకు దిగాడు.

కాలింగ్ బజర్ నొక్కాడు.

రెండు నిముషాలలో తలుపులు తెరచుకొన్నాయి.

ఆ వ్యక్తి తలుపులు తీసిన మనిషిని చూసి చిన్నగా మందహాసం చేసి, ఆ హాలుదాటి ఒక గదిలోకి వెళ్ళి, ఆ గదిలోంచి మరో హాలులోకి వెళ్ళాడు. ఆ హాలులో చాలామంది వ్యక్తులు వున్నారు.

వారిలో ఒక వ్యక్తి ఫుల్ బ్లాక్ డ్రస్ వేశాడు. ముఖానికి నల్లటి మాస్క్ తొడిగాడు.

ఆ మాస్క్ తొడుక్కున్న వ్యక్తి లోపలికి ప్రవేశించిన వ్యక్తిని చూసి, "చలం! నీతో రవి రాలేదా?" అని అడిగాడు.

"లేదు బాస్! వాడికి చాలా పొగరు. నేను ఎంత మంచిగా మాట్లాడినా వాడు చాలా పెడసరంగా మాట్లాడాడు."

చలం వినయంగా చెప్పాడు.

"చలం! అలాంటి పొగరుబోతు మనకి చాలా అవసరం. రవిలాంటి వాడే సూర్యాన్ని తేలికగా హత్య

చెయ్యగలడు. ఆ సూర్యంగాడు బ్రతికివుండగా మనం ముందుకుపోలేం. సూర్యం చావాలంటే రవి మన దారికి రావాలి. అలాంటి వాడిని ఎలా లొంగదీసుకోవాలో నాకు బాగా తెలుసు.

నువ్వు శాంతికి రవి పేర ప్రేమలేఖ వ్రాయి. అది కాలేజీ ఎడ్రస్‌కి పోస్టు చెయ్. తమ క్రింద పనిచేస్తున్న వాడు లవ్ లెటర్ వ్రాసినందుకు శాంతి, రవితో తగవు పడుతుంది. దానిఫలితం వాడి వుద్యోగం పోతుంది. ఆ తరువాత శాంతిని చంపెయ్. ఒకసారి నేరస్తుడిగా పోలీస్ రికార్డులోకి ఎక్కిన రవిని అనుమానించి తీరు తారు. అప్పుడు వాడు మనకి దాసోహం అంటాడు."

ఆ మాస్క్ తొడుక్కున్న వ్యక్తి చెప్పాడు.

చలం బాస్ చెప్పింది చెయ్యటానికి వెళ్ళిపోయాడు.

5

శాంతి లైబ్రరీ రూమ్‌లో వుండగా శాంతి స్నేహితు రాలు ఒక కవరు తీసుకొచ్చి, శాంతికి యిచ్చింది.

తనకు లెటర్ ఎవరు వ్రాసారా అని ఆలోచిస్తూ, ఆ అమ్మాయి వెళ్ళిపోయాక కవరు చింపి, లోపల కాయి తాన్ని బయటకు తీసి చదివింది శాంతి.

"డియర్ శాంతీ!

నీవు లేనిదే నేను బ్రతకలేను. నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను. మీ నాన్నగారి దగ్గర పని చేస్తు న్నాను కాబట్టి, ఆయనకి నాపై అభిమానం వుండ వచ్చు. నువ్వు సరేనంటే నీ సౌందర్యాన్ని నా స్వంతం చేసుకుంటాను.

ఇట్లు

నీ ప్రేమికుడు, రవి."

శాంతి కళ్ళు అగ్నిగోళాలయ్యాయి.

ఒక మామూలు వ్యక్తి, అందునా తమక్రింద పనిచేసే వాడు తనకు ప్రేమలేఖ వ్రాయటమా అని అనుకొంటుంటే ఆమెకు రవిమీద చెప్పలేనంత కోపం, అసహ్యం కలగసాగాయి.

శాంతి ఆ లెటర్ బుక్‌లో పెట్టేసుకొని, యింటికి వచ్చేసింది.

ఆమె ఇంటికి వచ్చేసరికి రవి, సారధిగారూ మాట్లాడు కొంటున్నాడు.

రవి తనగురించి వివరంగా ఆయనతో చెప్పాలనుకొని "మీతో ఒక ముఖ్యవిషయం చెప్పాలండీ" అని అన్నాడు.

శాంతి ఆ మాటల్ని మరోలా అర్థంచేసుకొన్నది.

రవిని చూడగానే ఆమె మరింత రెచ్చిపోయింది.

"డాడీ! ఈ ఇడియట్‌ని ముందు బయటకి గెంటండి" అంది ఆవేశంగా.

రవి తెల్లబోయాడు.

"నేనేం చేశాను శాంతీ!" అని అడిగాడు కలవరంగా.

శాంతి తన బుక్‌లోంచి లెటర్ తీసి అతని ముఖాన కొట్టి "మా క్రింద పనిచేసే వాడివి. నాకు ప్రేమలేఖ వ్రాసేటంతటి ధైర్యం నీకెలా వచ్చింది?" అని అంది.

రవి అయోమయంగా ఆ లెటర్ అందుకుని చదివాడు.

అది చదివిన అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"ఇది నేను వ్రాయలేదు. నన్ను నమ్మండి" అన్నాడు రవి బాధగా.

సారధిగారు, రవి చేతిలో లెటర్ అందుకొని చదివి వుగ్రుడైపోయాడు.

"రవీ! గోపాలరావు మీద గౌరవంకొద్దీ నిన్ను నా సెక్రటరీగా పెట్టుకొన్నాను. నువ్వు దురాశాపరుడివి. నా కూతుర్ని పెళ్ళాడి, నా ఆస్తిని కాజెయ్యాలని చూస్తున్నావు. నీలాంటి వాడు నా దగ్గరవుండ తగడు. నిన్ను ఈ రోజునుంచే పనిలోంచి తీసివేస్తున్నాను వెళ్ళు" అని గర్జించాడు.

"సార్! నా మాట నమ్మండి. శాంతిగారిమీద నా కలాంటి చెడు అభిప్రాయం ఎప్పుడు లేదు. నేను అంటే కిట్టని వాళ్ళు ఈ పని చేసివుంటారు. దయచేసి చేయని తప్పుకు నన్ను శిక్షించకండి సార్!" రవి పూడుకుపోయిన కంఠంతో అన్నాడు.

"ఐ సే యూ గెటౌట్!" శాంతి గట్టిగా అరిచింది.

రవి ముఖం చిన్నబోయింది.

"శాంతీ! దురదృష్టం నన్ను వరించింది. అందుకే నిందల పాలవుతున్నాను" అని నీరసంగా బయటకి వచ్చేసాడు.

పది గంటలవరకూ ఎక్కడెక్కడో తిరిగి, తిరిగి పది గంటలకు హోటల్ కాస్త్రికేయలో భోజనం చేసి, ఇంటికి వచ్చేసి, మంచంపై వాలిపోయాడు.

కళ్ళు మూస్తే తన జీవితమంతా చీకటేనేమో అనే భయం అతన్ని నిద్రపోనివ్వటం లేదు. మంచి మనుషులకి మనుగడే లేదా? అనే ఆలోచన అతన్ని ప్రశాంతంగా వుండనివ్వటం లేదు.

6

రవి వుదయాన్నే నిద్రలేచి, తన పనులన్నీ ముగించుకొని, నీరజ ఇంటికి బయులుదేరబోతుండగా సారధిగారి నౌకరు వచ్చాడు.

"ఏం, ధర్మన్నా! ఇలా వచ్చావు?"

మళ్ళా తనని పనిలోకి రమ్మని నౌకరుచేత కబురు పంపించారు కాబోలని, ఆశపడ్డాడు రవి.

"మిమ్మల్ని అయ్యగారు రమ్మన్నారండీ" అని చెప్పాడు వాడు.

రవి హుషారుగా వాడితో సారధిగారి బంగళాకు వెళ్ళాడు.

బంగళా ముందు పోలీస్ జీవ్ వుండటం చూసి, రవి భృకుటి ముడిపడింది. ఏదో భయం అతన్ని ఆవరించింది.

హాలులోకి అడుగుపెట్టి వికృతంగా వున్న శాంతి శవాన్ని చూసి స్థాణువులా నిలిచిపోయాడు.

ఆమె ముఖమంతా దేనితోనో చెక్కి వేయబడి వుంది.

చేతులమీద పళ్ళగాట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పోలీస్ డాక్టర్ ఇన్‌స్పెక్టర్‌తో అంటున్నాడు.

"హత్య సరిగ్గా పది గంటలకు జరిగింది. ఈ అమ్మాయిని ఎవరో రేప్ చేసారు. ఆ తరువాతే చంపేసారు" అని.

"సారధిగారూ! శాంతి ఒంటరిగా ఎక్కడైనా వెళ్ళిందా?" అని ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

అదే సమయంలో సారధి గారు, రవి రావటం చూసారు.

"అడుగో ఇనస్పెక్టర్ వాడే. ఆ దుర్మార్గుడే నా శాంతిని ఘోరంగా చంపేసాడు" అని అరిచారు ఆయన.

ఇనస్పెక్టర్ దృష్టి రవిమీద పడి నిలిచిపోయింది.

రవి లోలోన వణికిపోయాడు.

"సారధిగారూ! ఈ రవి ఈ మధ్యే జైలునుంచి విడుదలయి బయటకి వచ్చాడు. ఇతను రెండు హత్యలు చేసి,

పదేళ్ళు శిక్ష అనుభవించాడు. ఇతనికి మీకూ ఏం పరిచయం ఇతను మీ శాంతిని చంపటానికి గల కారణం చెప్పండి" ఇనస్పెక్టర్, సారథిగార్ని అడిగాడు.

"నా మిత్రుడొకడు వీడు మంచివాడని చెప్తే, నా సెక్రటరీగా పెట్టుకొన్నాను. నా ఆస్తిని చూసి ఆశపడి నిన్న శాంతికి ప్రేమలేఖ వ్రాసాడు. శాంతి నాకు చూపించింది అది. ఇద్దరం రవిని వుద్యోగంలోంచి తీసివేసాం. జరిగినదంతా శాంతి మనసుని చికాకు పరచింది. ఫస్ట్‌షోకి వెళతానని చెప్పి, పిక్చర్‌కు వెళ్ళింది. అంతే మళ్ళీ ఇప్పుడు ఇలా కనిపించింది.

నేను స్నానం చేస్తున్నప్పుడు ఎవరో వ్యక్తి ఒక పెట్టె తెచ్చి వెళ్ళిపోయాడని నౌఖరు చెప్పాడు. నా స్నానమయ్యాక తాళం కొట్టి చూస్తే, శాంతి శవం కనిపించింది. శాంతి తనకు దక్కలేదన్న కసితో రవి నా బిడ్డను చంపేసాడు" ఆయన కన్నీటితో అన్నారు.

"రవీ! నీ సమాధానం ఏమిటి?"

"ఇనస్పెక్టర్! రాత్రి పది గంటలకు నేను హోటల్ కార్తికేయలో భోజనం చేస్తున్నాను. ఆ హోటల్ మానేజర్‌కు నేను సారథిగారి సెక్రటరీనని బాగా తెలుసు. మీరు ఆయనకి ఫోన్ చేసి కనుక్కోండి."

రవి అలా అనేసరికి ఇనస్పెక్టర్ ఫోన్ దగ్గరకి నడిచి కార్తికేయ మానేజర్‌కు ఫోన్ చేసి, రవి చెప్పినది నిజమో, కాదో తెలుసుకొన్నాడు. రవి చెప్పింది కరక్టే.

ఇనస్పెక్టర్ ఫోన్ పెట్టేసి "రవీ! సరైన సాక్ష్యం లేకపోవటంతో నిన్ను అరెస్ట్ చెయ్యలేకపోతున్నాను. అయినా నిన్ను ఈ రోజునుంచి నీడలా వెంటాడుతాను. జాగ్రత్త!" అని అన్నాడు.

రవి ముఖంబాధగా పెట్టాడు.

ఆ తరువాత రవి, నీరజ ఇంటికి వెళ్ళాడు.

గోపాలరావుగారు వూరిలో లేరు. ఏదో పనిమీద బొంబాయి వెళ్ళారు.

నీరజ ఒక్కర్తే వుంది.

రవి జరిగినదంతా చెప్పాడు.

"నీరజా! ఆ వ్యక్తే శాంతిని చంపి వుండవచ్చు. అతన్ని గురించి చెప్పినా ఎవ్వరూ నమ్మరు. కారణం నేను హంతకుడనే ముద్ర వుంది" అని అన్నాడు వేదనగా.

నీరజ అతన్ని తన గుండెలకుహత్తుకొంది. "రవీ! నాన్న గారు వూరినుంచి రాగానే మన ప్రేమను గురించి చెప్తాను. నిన్ననే మేనేజర్ వెళ్ళిపోయాడు. నీకు ఆ పోస్ట్ ఇప్పిస్తాను. మనం తొందరగా పెళ్ళి చేసేను కొందాం."

నీరజ మాటలు అతన్ని శాంతపరచాయి.

7

గోపాలరావుగారు కూతురు చెప్పినదంతావిని, "నీరజా! రవి వుత్తముడే. అతను నీ భర్తగా అన్నివిధాల సరి పోతాడు" అని అన్నారు.

శాంతి మరణం రవివల్లే సంభవించిందని ఆయనకి తెలియదు.

సారధిగారు కూతురు పోవటంతో తన అన్న ఇంటికి వెళ్ళిపోయారు.

గోపాలరావుగారు వూరినించి రాగానే శాంతి చని పోయిందని, సారధిగారు వూరువిడిచి వెళ్ళిపోయారని మాత్రమే చెప్పింది నీరజ.

అందుకే ఆయన దృష్టిలో రవి మంచివాడే.

నీరజ తండ్రి తను పెళ్ళికి అంగీకరించటంతో ఎంతగానో పొంగిపోయింది. ఆ మర్నాడు రవిని కలసి తండ్రి తమ పెళ్ళికి అంగీకరించాడని చెప్పింది.

రవి ఆనందం వర్ణనాతీతం.

ఆ మర్నాడే అతను గోపాలరావుగారి ఫ్యాక్టరీ మేనేజరయ్యాడు.

సాయంత్రం ఫ్యాక్టరీ పని కాగానే రవి ఇంటికి వస్తున్నాడు. రోడ్ మీద నడుస్తుండగా అతని ప్రక్కగా ఎర్రటి కారు వచ్చి ఆగింది. ఆ ఎర్రకారు చూడగానే రవి గుండెలు దడదడ లాడాయి. అదే కారు ఆరోజు తన ముందు ఆగింది. ఆ కారులో వ్యక్తి...రవికి వూహించటానికే భయం వేసింది.

గబ, గబా ముందుకు నడిచాడు.

చలం కారులోంచి క్రిందకు దిగి, రవి చెయ్యిపట్టి ఆపాడు.

"రవీ! నీతో మాట్లాడాలి. కారెక్కు."

"మళ్ళీ హత్యను గురించేనా? అదే అయితే నేను వినను."

చలం ఎర్రగా చూసాడు.

"రవీ! చాలామూర్ఖంగా ప్రవర్తిస్తున్నావు. నా మాట వినకపోతే పరిణామం చాలా ఘోరంగా వుంటుంది."

"నేను నీకు ఏం అపకారం చేసానని ఇలా నన్ను బాధ పెడుతున్నావు. నువ్వు ఏం చేసినా నేను హంతకుడిని కాలేను. కాను. ఏ నాటికైనా మంచి జరగదా అనే ఆశతో జీవిస్తున్న నేను పతనం కాలేను" అని చెప్పి వడివడిగా ముందుకు వెళ్ళిపోయాడు రవి.

8

గోపాలరావుగారు ఫ్యాక్టరీనుంచి రాగానే నౌకరుని "రవీ, నీరజా సినిమానుంచి ఇంకా రాలేదా?" అని అడిగారు.

"ఇంకా రాలేదు. కానీ అయ్యగారూ! ఇందాకల ఒక మనిషి ఒక పెట్టె తీసుకొచ్చి ఇచ్చాడు."

గోపాలరావుగారు భృకుటి ముడిచి "ఏదీ పెట్టె" అని అడిగారు.

నౌకరు ఆయనను పెట్టివున్న గదిలోకి తీసుకు వెళ్ళి చూపించాడు.

"ఏమని చెప్పాడా మనిషి?" ఆయన అందులో ఏముందో వూహించటానికి ప్రయత్నిస్తూ అడిగారు.

"మీ అయ్యగారు రాగానే తాళం పగలగొట్టి, లోపల వున్న వస్తువును చూసుకోమను, అని చెప్పాడు బాబూ."

గోపాలరావుగారి మనసు కీడుని శంకించింది.

నౌకరుచేత తాళం పగులగొట్టించి, పెట్టి మూత తెరచి చూసాడు. పెట్టెలోపల నీరజ శవం ఆయన కళ్ళబడింది.

కూతురి శవాన్ని చూడగానే ఆయన గుండెలు బాదు కొంటూ ఏడవసాగారు.

నౌకరు పరుగున వెళ్ళి ఇనస్పెక్టర్‌కు ఫోన్ చేసి, జరిగినదంతా చెప్పాడు.

ఐదు నిముషాలలో ఇనస్పెక్టర్ గోపాలరావుగారి ఇంటికి వచ్చాడు.

ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్స్... డాక్టర్, ఫోటో గ్రాఫర్, తదితరులంతా తమ, తమ పనులను చకచకా ముగించారు.

శాంతిలాగే నీరజకూడా రేప్ చెయ్యబడి, మరణించిం దని డాక్టర్ చెప్పాడు.

"గోపాలరావుగారూ! మీ అమ్మాయి ఒంటరిగా బయ టకె వెళ్ళిందా?" ఏడుస్తున్న ఆయన్ని ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

"మా రవితో సినిమాకు వెళ్ళింది. ఆ తరువాత ఇలా కనిపించింది" ఆయన కన్నీటితో అన్నారు.

"రవి అంటే సారధిగారి దగ్గర సెక్రటరీగా పని చేశాడు అతనేనా?"

ఆయన అవునన్నట్లు తల వూపారు.

"గోపాలరావుగారూ! కేసు మబ్బులా విడిపోయింది. ఆ రవి లేడీ కిల్లర్. ఆడపిల్లలని అనుభవించి చంపటం అత నికి అలవాటు. అతనే మీ అమ్మాయిని చంపాడు" అని అన్నాడు ఇనస్పెక్టర్.

"రవా? అతను మా అమ్మాయిని ప్రేమించాడే. అలాంటిది అతను నీరజను చంపటమా? నో... నేను నమ్మను" ఆయన నమ్మలేనట్లుగా అన్నారు.

ఇనస్పెక్టర్ అతని గత చరిత్రని చెప్పి, ఆయన దగ్గర రవి ఇంటి అడ్రస్ తెలుసుకొని, అతని ఇంటికి బయలు దేరాడు.

ఆసమయంలో రవి ఏదో బుక్ చదువుకొంటున్నాడు.

ఎందుకో యధాలాపంగా కిటికీలోంచి చూసాడు.

పోలీస్ జీప్ అతని ఇంటివైపే దూసుకు వస్తున్నది.

రవి గుండెలు దడ, దడలాడాయి. అతని మదిలో చలం మెదిలాడు. మళ్ళీ ఏదో ఘోరం జరిగిపోయిందని, పోలీసులు తనని నేరస్థునిగా ఎంచి, అరెస్ట్ చెయ్యటానికే వస్తున్నారని గ్రహించాడతను.

పెరటిలోంచి వెనుకవీథిలోకి చేరుకొని, తిన్నగా నీరజ ఇంటికి వెళ్ళాడు. నీరజ ఇంటిముందు చాలామంది జనం మూగివున్నారు.

గుంపునంతటిని తోసుకు వెళ్ళి ఏం జరిగిందో తెలుసుకోవాలని అనుకొన్నాడు.

కానీ ఎవరో ఆ గుంపులోంచి "వాడు రెండు హత్యలు చేసాడట ఎప్పుడో పదేళ్ళు జైలులో వుండివచ్చాడట. శాంతిని కూడా వాడే చంపేసాడట. ఇప్పుడు నీరజను చంపేశాడు. ఇనస్పెక్టర్ గారు వాడి ఇంటికి వెళ్ళారట అరెస్ట్ చెయ్యటానికి" అని అంటుంటే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తనుకాని ఎవరి కళ్ళకైనా కనిపిస్తే మళ్ళీ జైలు జీవితమే అనుకొని వెనుతిరిగి వచ్చేశాడు. కొద్దిదూరం వెళ్ళగానే అతనిప్రక్క ఎర్రకారు వచ్చి ఆగింది.

రవిని చూడగానే చలం మందహాసం చేశాడు.

"నువ్వు చెప్పిన పని చెయ్యటానికే నిర్ణయించుకొన్నాను. పోలీసులు నా కోసం గాలిస్తున్నారు ఇప్పుడు. పద, వివరంగా మాట్లాడుకుందాం!" అంటూ కారులో ఎక్కికూర్చున్నాడు రవి.

పావుగంట తర్వాత చలం కారుని తమ బంగళా ముందు ఆపాడు.

గూర్ఖా చలాన్ని, రవిని పరీక్షగా చూసి గేటు తెరిచారు.

కార్ను లోపలికి పోనిచ్చి, ఒక వారగా ఆపి, ఇద్దరూ క్రిందకు దిగి బంగళా లోపలికి వచ్చారు.

రవి చూపులు హాల్లోవున్న అందరి మీదా వరసగా

పడి, ఆఖర్న మాస్క్ తొడుక్కున్న వ్యక్తిమీద నిలిచి పోయాయి. అతనే 'బాస్' అని గ్రహించాడు.

"మిస్టర్ రవీ! ఇంతకు ముందే మాతో రాజీపడివుంటే శాంతిని, నీరజను చంపేవాళ్ళం కాదు" అని ఆ మాస్క్ తొడుక్కున్న వ్యక్తి జాలిగా అంటుంటే రవిలో రక్తమంతా సలసల కాగిపోయింది.

"నువ్వు మా దారికి రావటానికి ఆ ఇద్దర్నీ చంపాల్సి వచ్చింది. ఇప్పుడు పోలీసులు నీ కోసం నగరమంతటా గాలిస్తున్నారు. రేపటికి నీ ఫోటో పేపర్లోకి కూడా ఎక్కుతుంది. ఇప్పుడు మా రక్షణ నీకు చాలా అవసరం. ఏమంటావ్!"

రవికి అతని కంఠస్వరం వింటున్న కొద్దీ ఎక్కడో, ఎప్పుడో విన్నట్టుగా అనిపిస్తోంది. కాని సరిగా నిర్ధారణ చేసుకోలేకపోయాడు.

"నేను అందుకే మీతో చేయి కలపాలని వచ్చాను. ఇప్పుడు నేను పోలీసుల దృష్టిలో నాలుగు హత్యలు చేసిన హంతకుడిని. ఒకవేళ నేను దొరికితే నాకు మరణ శిక్ష తప్పదు. అందుకే మంచికి గుడ్ బై కొట్టి, చెడుకు వెల్ కమ్ పలికాను. చెప్పండి ఒకటా, రెండా, ఎన్ని హత్యలు చెయ్యాలో" రవి కేర్లెస్ గా అంటుంటే అంతా అతని ధైర్యానికి ఆశ్చర్యపడ్డారు.

అతను తన జేబులోంచి ఒక ఫోటో తీసి రవికి అందించి "ఈ వ్యక్తిని నువ్వు చంపాలి" అని అన్నాడు.

రవి ఆ ఫోటో చూసి వులిక్కిపడ్డాడు.

ఆ ఫోటోలో వ్యక్తి ఎవరో కాదు, రవి అన్న సూర్యం.

తన అన్నని చూడగానే అతనిలో అనురాగం పొంగి పొరలింది.

"అతన్ని ఎందుకు చంపాలి?" అని ప్రశ్నించాడు.

"రవీ! సూర్యం నాకన్ని విధాల వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. మేం ఏదైనా దోపిడీ చెయ్యాలనుకొంటే. వాడు మా ప్లాను పడగొట్టి ఆ పని తను చేస్తున్నాడు మేము కూడా వాడి ప్లాన్స్ అలాగే పడగొడుతున్నాం అనుకో. కానీ ఇది ఇరుపార్టీల వారికి చాలా ఇబ్బంది. సూర్యం చస్తేకాని మేం ముందుకు పోలేం!"

"అంతా బాగానేవుంది. కానీ ఒక్క మనిషిని చంపటానికి ఇందరు వుండగా నేనే ఎందుకూ?"

"రవీ! మా ముఠాలో ప్రతీవ్యక్తిని ఆ సూర్యంగాడికి బాగా తెలుసు. అందుకే మేము వాడిని వంచించలేక పోతున్నాం. సూర్యం రోజూ సాయంత్రం ఆరుగంటలకు హోటల్ కార్తికేయకు వస్తుంటాడు. నువ్వు రేపు అతన్ని కల్సుకొని, అతనితో పరిచయం కల్గించుకొని, అతన్ని చంపాలి. ఈ పని తెలివిగా చేస్తే, నీకు మంచి బహుమతి లభిస్తుంది."

రవి తను అన్నింటికి సిద్ధమే అన్నట్లు తలవూపి, మాస్క్ తొడుకొన్న వ్యక్తితో కొంతసేపు మాట్లాడి బయటపడ్డాడు.

9

ఆమర్నాడు సాయంత్రం రవి తన వేషాన్ని కొంచెం మార్చుకొని కార్తికేయలోని కెళ్ళాడు.

సర్వర్‌కి గులాబ్ జామ్ ఆర్డర్ చేసి, అందర్నీ ఓసారి చూసాడు. సూర్యం కనిపించలేదు అతనికి.

సర్వర్ గులాబ్ జామ్ పెట్టి వెళ్ళిపోయాక తింటూ అందర్నీ గమనించసాగాడు.

అతని చూపులు మాటి, మాటికి వీధిలోకి పరిగెడుతున్నాయి, సూర్యం రాకకోసం.

అంతలో ఒక వ్యక్తి హోటల్ లోకి ప్రవేశించాడు.

ఆ వ్యక్తి రవి ముందు కుర్చీలో కూర్చొని బాదంగీర్ ఆర్డర్ ఇచ్చాడు.

సర్వర్ అది తెచ్చిపెట్టి వెళ్ళిపోయాక "రవీ! నా పేరు జయరాజ్. నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి" అని అన్నాడు.

"ఏం మాట్లాడాలి?" రవి ఆశ్చర్యంగా అడిగాడు.

"ముందు టిఫిన్ తిను. తర్వాత మాట్లాడుకొందాం" జయరాజ్ బాదంగీర్ తాగుతూ అన్నాడు.

రవి అతను ఏం చెప్తాడో అని తొందరగా తినేసి, చెయ్యి కడుక్కొన్నాడు.

అతను తినేసాక బిల్ చెల్లించి ఇద్దరూ హోటల్ బయటకి వచ్చారు.

జయరాజ్ హోటల్ ముందున్న టొయోటో కారు ఎక్కాడు.

రవి మౌనంగా అతని ప్రక్కనే కూర్చున్నాడు.

మరుక్షణం కారు సర్రున దూసుకుపోయింది.

"రవీ! నువ్వు నాగరాజారావుని చంపాలి!"

"ఎవరా నాగరాజారావు."

జయరాజ్ తన జేబులోంచి ఒక ఫోటో తీసి రవికి అందించాడు.

ఆ ఫోటో చూడగానే రవి అంతెత్తున త్రుళ్ళిపడ్డాడు. ఆ ఫోటో అతని తండ్రిది.

రవికి మతిపోతున్నట్లు అనిపించింది.

తన తండ్రీ, అన్న ఇద్దరూ దేశద్రోహులే. పైగా ఒకర్ని ఒకరు చంపుకోవాలని చూస్తున్నారు. ఆ ఇద్దరికీ తమ రక్తసంబంధం తెలుసా?

"జయరాజ్! నాగరాజారావు సూర్యానికి ఏమైనా అవుతాడా?"

"అవుతాడా అని చిన్నగా అడుగుతావేం! ఇద్దరూ తండ్రీ కొడుకులు. అయితే ఇద్దరూ తగవుపడి విడిపోయారు. నాగరాజారావు వుంటే మాకు చాలా ఇబ్బంది. నువ్వు సూర్యాన్ని చంపటానికి వినియోగించబడ్డావని మాకు తెలును. వాళ్ళ వేలితో వాళ్ళ కన్నే పొడవాలి. నీకు రివాల్వర్ ఇస్తాను. నాగరాజారావుని షూట్ చేసి రావాలి."

రవి ఎంతగానో ఆశ్చర్యపోయాడు.

తండ్రీ, కొడుకులని తెలిసినా ఇద్దరూ ఒకర్ని, ఒకరు చంపుకోవాలనుకొంటున్నారా?

రవి జయరాజ్ వైపు చూసి "ముందు నేను సూర్యాన్ని చూడాలి. అతని దగ్గరకు తీసుకువెళ్ళు" అని అన్నాడు.

అతను రెండు క్షణాలు ఆలోచించి కారుని సూర్యం ఇంటికి పోనిచ్చాడు.

సూర్యం ఇల్లు చాలా ఆధునికంగా కనిపించింది.

జయరాజ్ కారు దిగి దగ్గరగా వేసి వున్న తలుపుల్ని చూసి, ఖంగారుగా లోపలకి ప్రవేశించాడు.

రవికూడ అతనితో లోపలకి వెళ్ళాడు.

టేబిల్ మీద పేపర్ వైట్ క్రింద రెప, రెప లాడు తున్న కాయితం ఇద్దరి కళ్ళకు కనిపించింది.

జయరాజ్ దాన్ని అందుకొని పైకే చదివాడు.

"జయరాజ్! నీ బాస్ సూర్యం లక్కీగా మా చేతికి చిక్కిపోయాడు. రేపటికి నీ బాస్ శవాన్ని నీకు కానుకగా పంపిస్తాం!"

ఇట్లు,
—నాగరాజారావు".

"రవీ! కమాన్. మనం సూర్యాన్ని రక్షించాలి. నాగరాజారావు స్థావరం చూపించు" అతను కలవరంగా అన్నాడు.

"మిస్టర్ జయరాజ్! సూర్యాన్ని విడిపించాలంటే నాకు ఒక రివాల్వర్, ఒక టేప్‌రికార్డర్ కావాలి!" అన్నాడు రవి.

అతను ఎందుకూ? అని ప్రశ్నించకుండా ఆ రెండూ రవికి అందించాడు.

రవి రివాల్వర్ అందుకొని రెప్పపాటులో అది వెనక్కి త్రిప్పి జయరాజ్ తలపై బలంగా కొట్టాడు.

అతను చిన్నగా మూలిగి క్రిందపడ్డాడు.

రవి టెలిఫోన్ దగ్గరకు నడచి పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసాడు.

నాగరాజారావు స్థావరానికి రమ్మని ఇన్‌స్పెక్టర్‌కు ఆ ఎడ్రస్ చెప్పి, బయటకి నడచి తలుపులు మూసేసి, కారు ఎక్కాడు.

అతను నీరజ దగ్గర డ్రైవింగ్ నేర్చుకొన్నాడు.

కారును నాగరాజారావు బంగళా వైపుకు పోనిచ్చాడు.

గూర్ఖా రవిని ఎరిగివుండటంతో మర్యాదగా సలాం చేసి గేటు తెరిచాడు.

రవి కారుని లోపలకి పోనిచ్చి, ఒక వారగా ఆపి, జేబులో వున్న టేప్ రికార్డర్ ఆన్ చేసి, రివాల్వర్‌తో లోపలికి నడిచాడు.

10

సూర్యాన్ని నలుగురు పెడరెక్కలు విరచి గట్టిగా పట్టుకొన్నారు.

నాగరాజారావు రివాల్వర్ అతని గుండెలకు గురిపెట్టి నిలుచున్నాడు.

"నాన్నా!" రవి గట్టిగా అరచినట్లు పిలిచాడు.

నాగరాజారావు ముఖానికున్న మాస్క్ తీసి, రవిని వింతగా చూసాడు.

"నాన్నా! సూర్యం నీ కొడుకు. నేను మీ రెండవ కొడుకు రవిని" రవి గాబరా నటిస్తూ అన్నాడు.

నాగరాజారావు పెళ్ళున నవ్వాడు. "రవీ! మా ఇద్దరికీ మా సంబంధం తెలుసు. సూర్యం చిన్ననాటినుంచి నాకు వ్యతిరేకంగా పెరిగాడు. మీ అమ్మా, ఆ విశ్వనాథం, నన్ను వంచించి అక్రమ సంబంధం పెట్టుకొన్నారు. విశ్వనాథంగాడు నా అనుచరుడిగా వుంటూ నన్ను మోసగించాడు. అందుకే ముందు మీ అమ్మని చంపేసాను. ఆ తరువాత విశ్వనాథాన్ని చంపేసాను. ఆ రెండు హత్యలు నీ మీద పడ్డాయి. నువ్వు జైల్లో వుండటమే వుత్తమం అనుకొన్నాను. ఎందుకంటే నీకు చాలా మంచి గుణాలు వున్నాయి. నువ్వు మాతో వుంటే మా పనులకు ఆటంకం.

ఇప్పుడు మీ ఇద్దరూ నా చేతికి చిక్కారు మీ ఇద్దరూ

బ్రతికి వుండకూడదు. నీవు శాంతి, నీరజలను చంపింది మేమే అని తెలుసు, అంతేకాదు, నా రూపాన్ని కూడా చూసేసావు. అందువల్ల నువ్వు కూడా..."

నాగరాజారావు రివాల్వర్ రవి వైపు త్రిప్పబోతుండగా రవి చటుక్కున రివాల్వర్ తీసి అతని గుండెలకి గురిపెట్టాడు.

"మర్యాదగా అంతా గన్స్ క్రింద పడెయ్యండి" రవి గర్జిస్తున్నట్లు అన్నాడు.

అంతా గప్ చిప్ గా గన్స్ క్రింద పడేసారు.

సూర్యం, రవి వైపు ఆశగా చూస్తూ—

"రవీ! ముందు నాన్నని చంపెయ్" అని అన్నాడు.

"మైడియర్ బ్రదర్. నేను మీలా హంతకుడిని కాను. న్యాయంకోసం ప్రాకులాడే మనిషిని. మీరు మీరు చంపుకొని ఆ నేరం నా మీదికి నెట్టాలని చూశారు. ఇంకొక్క రెండు క్షణాలలో పోలీసులు వస్తారు..." అతను ఇంకా ఏదో అనబోతుండగా ఇనస్పెక్టర్, పోలీసులు లోపలికి ప్రవేశించారు.

"ఇనస్పెక్టర్! పదేళ్ళు నేను చేయని నేరాలకి శిక్ష అనుభవించాను. ఆ రెండు హత్యలూ చేసింది నాగరాజారావు. ఆ విషయాలన్నీ టేప్ రికార్డర్‌లో వున్నాయి" రవి టేప్ రికార్డర్ జేబులోంచి తీసి, ఇనస్పెక్టర్‌కు అందించాడు.

నాగరాజారావుకు, సూర్యానికి అందరికీ బేడీలు పడ్డాయి.

రవి, జయరాజ్ గురించి కూడా చెప్పాడు.

* * *

నాగరాజారావుకు మరణ శిక్ష పడింది.

సూర్యానికి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది.

రవి నిర్దోషి అన్న సంగతి పేపర్లు ప్రకటించాయి. ఎందరో అతని నిజాయితీని అభినందించారు.

ఇనస్పెక్టర్ రవి చేతిని తన చేతిలోకి తీసుకొని "రవీ! నీలాంటి నిజాయితీపరుడువల్ల దేశానికి పట్టిన చీడపురుగుల్ని ఏరి పారెయ్యవచ్చు" అని అన్నాడు.

"ఇనస్పెక్టర్! నా నిజాయితీకోసం నా ప్రేయసిని, అమాయకురాలైన శాంతిని వదులుకొన్నాను. తండ్రినీ, అన్నను, పోలీస్‌లకు పట్టి ఇచ్చాను. నేను ఈ లోకానికి మిగిలి వుండవచ్చు కానీ, లోకంలో నాకేం మిగల్లేదు" రవి బాధగా అన్నాడు.

"రవీ! బాధపడకు నువ్వు నా ఇంట్లోనే వుందుగాని. నిన్ను చదివించి, నాలాగే ఇనస్పెక్టర్‌ని చేస్తాను. నువ్వు మణి లాంటి వాడివి. నీలాంటి సాహస యువకుడు మన మాతృదేశానికి వెన్నుపూస వంటివాడు..."

ఆయన మాటలు పూర్తి కాకుండానే, రవి ఆయన కాళ్ళకు నమస్కరించాడు.

——: ఐపోయింది :——